సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



'డీసీసీ బ్యాంకును లాభాలబాట పట్టించాం'
జిల్లాలో డీసీసీ బ్యాంకును నష్టాల నుంచి గట్టెక్కించి లాభాలబాట పట్టించామని ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. - 8లో



ని'బంధనాలు' ఉండవిక!
రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు ఇప్పటి వరకూ ఉన్న నిబంధనలను ప్రభుత్వం సడలించింది. సాయం చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచనుంది - 8లో



ఆదుకోండి.. ఆదరించండి
నాన్న చనిపోయాడు...అమ్మ వదిలేసి వెళ్లిపోయింది. అనాథలుగా మిగిలిన ఆ చిన్నారులు సాయం చేసే చేతుల కోసం ఎదురు చూస్తున్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
కడప	6.31	4.54
ప్రొద్దుటూరు	6.29	4.57
పులివెందుల	6.34	4.59

అసలు దొంగలు ఎవరో?



ఈ చిత్రంలో కనిపించేది కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం. గతంలో ఇక్కడ పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి. పలు అంశాలు చర్చకు దారి తీశాయి. అప్పుడు 'సాక్షి' పలు సంచలన కథనాలను ప్రచురించింది. తరువాత కాలంలో ఆ కార్యాలయంలో పరిపాలన గాడిలో పడినట్టైంది. తాజాగా స్టాఫ్ నర్సుల నియామకాల ప్రక్రియ వివాదాస్పదంగా మారింది.

- బోగస్ సర్టిఫికెట్లతో స్టాఫ్ నర్సుగా ఉద్యోగాలు
- అవి 'ట్యాంపర్డ్' సర్టిఫికెట్స్ అని నిర్ధారణ
- అక్రమాలకు పాల్పడిన బోగస్ ఉద్యోగులపై కేసులు
- వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం నిర్ణయాలపై విమర్శలు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో 291 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ మేరకు కడపలోని ఆ శాఖ కార్యాలయానికి రాయలసీమలోని జిల్లాల నుంచి 11 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ఆ శాఖ అధికారులు జనవరి 17వ తేదీ నుంచి స్టాఫ్ నర్సుల నియామకాలను చేపట్టారు. ఉద్యోగాలు పొందిన వారు రెండు నెలల నుంచి వేతనాలు కూడా పొందుతున్నారు.

అనుమానమే నిజమైంది...

చిత్తూరు జిల్లాలో పదవీ విరమణ పొందిన ఒక పోలీసు ఉద్యోగి కుమార్తెకి మంచి మార్కులు ఉన్నాయి. అయితే ఆమెకు ఉద్యోగం రాలేదు. ఇతరులకు వచ్చాయి. ఆ రిటైర్డ్ ఉద్యోగికి అనుమానం వచ్చింది. ఉద్యోగాలు పొందిన వారిపై సంబంధిత శాఖకు ఫిర్యాదు చేశారు. మొత్తం 15 మంది మార్కుల సర్టిఫికెట్స్‌ను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి పంపారు. అందులో 8 మంది మార్కుల జాబితా «ట్యాంపర్డ్» (సర్టిఫికెట్ మార్ఫింగ్)గా నిర్ధారించారు. ఆ 8 మందిలో వైద్య విధాన పరిషత్ విభాగానికి చెందిన ఉద్యోగులు ఐదుగురు, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు ఉండగా, ఒక అభ్యర్థి జాబితాలో ఉన్నప్పటికీ మెరిట్ లేనందున ఉద్యోగం రాలేదు.

షోకాజ్ నోటీసుకు బదులు లేనందున...

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నుంచి ఆ 8 మంది నివేదిక కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి చేరింది. ఆ ఎనిమిది మందిలో ఐదుగురు వైద్య విధాన పరిషత్‌కు చెందిన వారు ఉన్నారు. ఆ ఉద్యోగులపై చర్యల నిమిత్తం నివేదికను వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు పంపారు. ఇక ఇద్దరు ఉద్యోగులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు చెందిన వారు తమ పరిధిలోకి రావడంతో వారికి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఇంత వరకు వారి నుంచి సమాధానం లేకపోవడంతో వారిపై కేసులు బనాయించడానికి రంగం సిద్ధమైంది.

మరో బోగస్ ఉద్యోగ నియామకం..

ఈ బోగస్ మార్కుల సర్టిఫికెట్స్ బాగోతం బయట పడక ముందు. ఒక అభ్యర్థి తాను స్టాఫ్ నర్స్ పోస్టుకు ఎంపికైనట్లు, తనకు పోస్టింగ్ ఇవ్వాలని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు వెళ్లారు. ఆ నియామక పత్రం ప్రకారం నిర్దేశించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోస్టింగ్ లేదని అక్కడి అధికారులు గమనించి ఇక్కడ ఉన్న ప్రాంతీయ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. ఆ నియామక పత్రాన్ని గమనించిన అధికారులు అది ఒక బోగస్ నియామక పత్రంగా తేల్చారు. అనంతరం ఆమెపై అధికారులు కడప పోలీస్ స్టేషన్‌లోఫిర్యాదు చేశారు. కాగా ఈ బోగస్ ఉద్యోగ నియామక పత్రంపై సంబంధిత అధికారుల సిగ్నేచర్ (సంతకం) ఎవరిది ఉందనేది ఆసక్తిగా మారింది.

అక్రమాల వెనుక హస్తం ఎవరిదో..

మొత్తం ఈ బోగస్ వ్యవహారమంతా చిత్తూరు జిల్లా కేంద్రంగా సాగడం గమనార్హం. బోగస్ సర్టిఫికెట్లను పదుల సంఖ్యలో సృష్టించడం అంటే మాటలు కాదు. ఇదంతా ఎవరో బాగా అనుభవజ్ఞులైన వారి కనుసన్నల్లో జరుగుతున్నట్లుగా ఆ శాఖ ఉద్యోగులు అనుమానిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం ఇంటి దొంగల పనా లేక బయటి దొంగల మాయాజాలమా. లేదంటే ఇద్దరూ కలిసి ఆడుతున్న నాటకమా.? అనేది తేలాలంటే సమగ్ర విచారణ చేపట్టాలని ఆ శాఖ ఉద్యోగులు కోరుతున్నారు. మొత్తం మీద ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో అనేది ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

కేసులు బనాయించమని ఆదేశించాం

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు నియామకాల్లో బోగస్ మార్కుల జాబితాను సమర్పించి, మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందారని ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం 15 మందిలో 8 మంది మార్కుల జాబితాను 'ట్యాంటర్డ్' చేశారని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ నుంచి నివేదిక వచ్చింది. ఇందుకు సంబంధించి షోకాజ్ నోటీసులకు బదులు ఇవ్వనందున, వారిపై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. మిగతా ఏడుగురి నివేదిక త్వరలో రానుంది. బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారు, అందుకు సహకరించిన వారిపై కఠిన చర్యలు చేపడతాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

రేపు సీఎం వైఎస్ జగన్ ఒంటిమిట్టకు రాక



కడప సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలోని ఒంటిమిట్టలో పర్యటించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఒంటిమిట్టలో జరుగుతున్న కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆయన హాజరై స్వామి వారిని దర్శించుకోనున్నారు. అదేరోజు తిరిగి సాయంత్రం కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి తాడేపల్లికి వెళ్లనున్నారు.

పర్యటన వివరాలిలా.. ఈనెల 5వ తేదీన

- మధ్యాహ్నం 12.50 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 1.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళతారు.
- 1.15 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 2.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 2.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2.35 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- 2.40 నుంచి 3.15 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు.
- 3.25 గంటలకు టీటీడీ అతిథి గృహం నుంచి బయలుదేరి కోదండరామస్వామి ఆలయానికి చేరుకుంటారు.
- 3.30 నుంచి 3.50 గంటల వరకు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- 3.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి టీటీడీ అతిథి గృహానికి చేరుకుని 4.20 గంటల వరకు అక్కడే ఉంటారు.
- 4.25 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.55 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- సాయంత్రం 5.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని 6.10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

న్యూస్‌రీల్

తుపాకి లైసెన్సులపై అసత్య ప్రచారం చేస్తే చర్యలు

కడప అర్బన్ : జిల్లాలో తుపాకి లైసెన్సులపై అవాస్తవాలు, అసత్య ప్రచారం చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2014 నుంచి 2019 వరకు జిల్లాలో 117 తుపాకి లైసెన్సులు మంజూరు చేశామన్నారు. 2019 నుంచి 2023 ఇప్పటివరకు 159 లైసెన్సులను మంజూరు చేశామని తెలిపారు. వీటిలో 70 శాతం లైసెన్సులు ఏటీఎంల క్యాష్ లోడింగ్‌కు, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ గార్డ్స్‌కు ఇచ్చినవేనని స్పష్టం చేశారు. గత పదేళ్లలో మొత్తం 276 లైసెన్సులు మంజూరు చేశామని వివరించారు.

సత్వరం స్పందించి న్యాయం చేయాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో ఆయన బాధితులతో ముఖాముఖి మాట్లాడారు. అలాగే వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కూడా పలువురి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

సరస్వతీమాతకు పూజలు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఆవరణంలో ఉన్న సరస్వతీ మాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల పరిశీలకుడు వెంకటకృష్ణారెడ్డి, డీఈఓ రాఘవ రెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్, కడప ఎంఈఓ పాలెం నారాయణ పాల్గొన్నారు.

నవనీత కృష్ణాలంకారం.. ముగ్ధమనోహరం



నవనీతకృష్ణుడికి హారతి ఇస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలో వెలసిన కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం ఉదయం స్వామి నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భక్త జన బృందాలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం కృష్ణుడు వెన్న దొంగ, రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంటిలోనే గాక అందరి ఇళ్లల్లో దూరి వెన్న దొంగతనంగా ఆరగించేవాడు. ఈ చిన్ని కృష్ణుడిని లీలలను గుర్తు చేస్తూ రాముల వారు వెన్నకుండతో భక్తులకు దర్శన మిచ్చారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. రాత్రి ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో హనుమంత వాహనంపై భక్తవత్సలుడిలా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

- ఉదయం 9 గంటలలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- 27,354 మందికి 27,179 మంది హాజరు
- జిల్లాలో పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన పరిశీలకుడు, జిల్లా విద్యాశాఖాధికారి



కడపలోని పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నాన్న తోడుగా..

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులంతా ఉదయం 8.30 నుంచే తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులను అధికారులు ఏర్పాటు చేశారు. తాగునీరు. పరీక్ష గదుల్లో లైటింగ్‌తోపాటు డెస్కులు, మెడికల్ సామగ్రిని విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు ఒక సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించారు. దీంతోపాటు చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు కూడా ఈ సారి సెల్‌ఫోన్‌ను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. జిల్లా వ్యాప్తంగా 146 పరీక్షా కేంద్రాలలో 27,354 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,179 మంది హాజరయ్యారు. 175 మంది గైర్హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను కూడా మూయించేశారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

పదవ తరగతి పరీక్షల నిర్వహణను మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా పరిశీలకుడు మార్తల వెంకటకృష్ణారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డితో కలిసి కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్, డిపార్టుమెంట్ అధికారులతోపాటు సిట్టింగ్ స్క్వాడ్‌కు పలు సూచనలు ఇచ్చారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు, పరీక్షా కేంద్రం వద్ద పరిశీలకుడు వెంకటకృష్ణారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి

పటిష్ట చర్యలు తీసుకున్నాం

జిల్లా పరిశీలకుడు మార్తల వెంకటకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుత పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించామన్నారు. నేలబారు పరీక్షలకు తావు లేకుండా చేశామన్నారు. ఎక్కడైనా మాల్ ప్రాక్టీస్ జరిగినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఆయన కడప, అన్నమయ్య జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాలను, డీఈఓ రాఘవరెడ్డి 5, ఫ్లైయింగ్ స్క్వాడ్ 57 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పేపర్ లీక్ అవాస్తవం

బి.మఠం : బ్రహ్మంగారిమఠం పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రం లీకైయిందనే విషయం అవాస్తవమని పరీక్షల పరిశీలకుడు వెంకటకృష్ణారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 9.30 గంటలకు పరీక్ష మొదలైతే 11.45 నిమిషాలకు పేపర్ లీకు అనే వార్త ప్రచారమైందన్నారు. విషయం తెలియగానే తాము బి.మఠానికి చేరుకుని విచారించామన్నారు. ఒక జిరాక్స్ సెంటర్‌లో కొన్ని ప్రశ్నలకు జవాబులున్న పేపర్ లభ్యమైందన్నారు. కానీ ఈ పేపర్ పరీక్ష కేంద్రంలోని విద్యార్థులకు చేరలేదన్నారు. జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గ్రూప్ 4 పరీక్ష

కడప సిటీ : ఏపీపీఎస్సీ గ్రూప్ 4 కంప్యూటర్ ఆధారిత ఏపీ రెవెన్యూ శాఖ కు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ పోస్ట్ మెయిన్ పరీక్ష ఈ నెల 4 వ తేదీన జరగనుందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 1726 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు.
■ కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీ, కృష్ణాపురంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ, కందుల ఓబులరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, చాపాడు మండలంలోని చైతన్య భారతి ఇంజినీరింగ్ కాలేజీ, ప్రొద్దుటూరులోని సాయిరాజేశ్వరీ ఇంజినీరింగ్ కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

అటవీ అనుమతి మంజూరు చేయండి



సత్య ప్రకాష్‌యాదవ్‌కు వినతి పత్రం ఇస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : కాశినాయన ఆశ్రమానికి అటవీ శాఖ అనుమతి మంజూరు చేయాలని నేషనల్ బోర్డు వైల్డ్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సెక్రటరీ సత్య ప్రకాష్ యాదవ్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం ఢిల్లీలోని నేషనల్ బోర్డు వైల్డ్ స్టాఫ్ స్టాండింగ్ కమిటీ మెంబర్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా అటవీ శాఖకు గతనెల 20వ తేదీన పంపిన లేఖను ఈ వినతికి జత చేసినట్లు తెలిపారు. అటవీ శాఖ అనుమతుల ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీలో పెట్టి వీలైనంత త్వరగా ఆమోదం తెలపాలని సత్య ప్రకాష్ యాదవ్‌ను ఎంపీ కోరారు.

ని'బంధనాలు' ఉండవిక

రోడ్డుప్రమాద బాధితులకు సాయం చేస్తే చిక్కులుండవ్

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు ఇప్పటి వరకూ ప్రభుత్వం నిబంధనలు కఠినతరంగా ఉండేవి. తాజాగా ప్రమాద బాధితులకు సహాయం చేసేవారికి అనుకూలంగా గతంలో సుప్రీం కోర్టు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ప్రమాద బాధితులకు సహాయం చేసేవారికి అండగా నిలుస్తుంది. వీరిని వేధింపులకు గురిచేసేందుకు వీలు లేదు.

కడప కార్పొరేషన్ : ఒకటి కాదు...రెండు కాదు.. రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణమైంది. భారత దేశంలో ప్రతి నాలుగు నిముషాలకు రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారని ఓ సర్వే చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రమాదంలో గాయాలపాలైన వారికి వైద్య సేవలు అందించేందుకు ఇదివరకూ ప్రభుత్వ నిబంధనలు ప్రతిబంధకంగా ఉన్నాయి. బాధితుల అత్యవసర పరిస్థితి చూసి ఎవరైనా స్పందించి ఆసుపత్రిలో చేర్పినా, వారిని పోలీసులు విచారణ పేరుతో వేధించేవారు. వివరాలు సేకరించే నెపంతో గంటల తరబడి నిలిపి ఉంచేవారు. ఇది చాలదన్నట్లు కేసులంటూ కోర్టుల చుట్టూ తిప్పేవారు. ఫలితంగా ఈ నిబంధనల తలనొప్పి మాకెందులే...అని జనం సాయం చేసేందుకు ముందుకు వచ్చేవారు కాదు. ఎవరైనా ప్రమాదం బారిన పడి రోడ్డుపై సాయం కోసం అర్థిస్తున్నా, రక్షించేందుకు అవకాశం ఉన్నా కూడా ఎవరూ బాధ్యత తీసుకొనేందుకు సిద్ధపడేవారు కాదు.



రోడ్డు ప్రమాద దృశ్యం

■ రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందించేందుకు వారికి సమీపంలోని ఆస్పత్రికి తరలించేవారికి ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం గతంలో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రమాద బాధితులకు సాయం చేసేవారు తమ వివరాలను చెప్పకపోయినా..వారు తీసుకొచ్చిన క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్చుకోవాల్సిందే. వారు తమ వివరాలను వెల్లడించి స్వచ్ఛందంగా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబుతామంటేనే పోలీసులు వారి వివరాలు నమోదు చేసుకోవాలి. లేనిపక్షంలో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి రక్షకులు వెళ్లిపోవచ్చు. ఈ సరికొత్త గెజిట్ ఏయే నిబంధనలు ఉన్నాయంటే..

పేరు చెప్పాల్సిన పనిలేదు

రోడ్డు ప్రమాద బాధితులను సమీపంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొని రావచ్చు. ఆతన్ని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి తమ వివరాలు, చిరునామా చెప్పి వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవచ్చు. అంతకు మించి ఆస్పత్రి సిబ్బంది రక్షించిన వ్యక్తిని వివరాలేమీ అడగరు. ఉండమని చెప్పరు. సాయం చేసిన వారి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించకూడదు. ఇలా చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు.

ఒక్కసారే కోర్టుకు..

ఎవరైనా రోడ్డు ప్రమాదానికి ప్రత్యక్ష సాక్షి అయితే కేసు దర్యాప్తులో భాగంగా తన వివరాలను పోలీసులకు అందజేయవచ్చు. వీరు కేసు విచారణలో సాక్ష్యం చెప్పేందుకు ఒక్కసారి కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. అతన్ని విచారణ పేరిట పోలీసులు వేధింపులకు గురిచేయకూడదు. ఎప్పుడు రావాలో సదరు సాక్షికి తెలియజేయాలి. తరువాత అతన్ని కోర్టుకు పిలువకూడదు.

విలువైన కాలం

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సాయం చేసేవారు చాలా అరుదు. రోడ్డుపై రక్తం కారుతూ ఎవరైనా పడిఉన్నా పట్టించుకోకుండా పోయేవారే ఎక్కువ. ఇందుకు నిబంధనలు కూడా ఒక కారణమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడటానికి ప్రతిక్షణం అమూల్యమైనదే. ఈ క్షణాలను గోల్డెన్ అవర్స్‌గా పిలుస్తారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో సాయం చేయాలని ఎంత మనస్సు ఉన్నా నిబంధనలు, కేసుల భయంతో ఎవరూ ముందుకు రాకపోవచ్చు. ఇటువంటి సమస్యలు లేకుండా క్షణం ఆలస్యం చేయకుండా బాధితులను ఎవరైనా ఆసుపత్రికి తరలించేలా సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడుతాయి. బాధితులను ఆస్పత్రిలో చేర్పించిన వారిపైగానీ, కొత్త గెజిట్‌పైగానీ ఏవిధమైన సివిల్, క్రిమినల్ కేసులు పెట్టేందుకు అవకాశం లేదు.

గాయపడిన వారికి సత్వరమే వైద్యం

ప్రమాద బారిన పడిన క్షతగాత్రులకు తక్షణమే చికిత్స అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉంది. సరైన కారణం లేకుండా వైద్యుడు చికిత్స చేసేందుకు నిరాకరిస్తే అతనిపై ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఈ నిబంధనలు తక్షణమే అమలు చేయాల్సి ఉంటుంది.

బ్రహ్మోత్సవాలకు 118 ప్రత్యేక బస్సులు

కడప సిటీ : ఒంటిమిట్టలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల రవాణా సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 118 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈబ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో రవాణా పరంగా ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ 118 ప్రత్యేక బస్సులను ఆయా ముఖ్య ప్రదేశాల నుంచి రూట్ల వారీగా కేటాయించడం జరిగిందని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.
■ కడప డిపో నుంచి 45, పులివెందుల 10, బద్వేలు 20, జమ్మలమడుగు 10, మైదుకూరు 5, ప్రొద్దుటూరు డిపో నుంచి 20 బస్సులతోపాటు ఇతర రీజినల్ డిపోల నుంచి 8 బస్సులను నడపనున్నారు.
■ 5వ తేది నిర్వహించే కల్యాణం రోజున కడప వైపు నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచి కల్యాణ వేదిక వరకు భక్తులను తరలించేందుకు నాలుగు ఉచిత బస్సులు, అలాగే రాజంపేట వైపు నుంచి వచ్చే వాహనాలపార్కింగ్ ప్రదేశం నుంచి కల్యాణ వేదిక వరకు ఆరు బస్సులను ఏర్పాటు చేశారు.

ఆదుకోండి.. ఆదరించండి

చక్రాయపేట : నాన్న చనిపోయాడు.. అమ్మ వదిలేసి వెళ్లిపోయింది. ఉండటానికి ఇల్లు లేదు. దుస్తులు కూడా కరువు. వీరి ఆరోగ్యం అంతంతమాత్రం. అమ్మమ మకారం.. నాన్న గారాబం మధ్య హాయిగా సాగిపోవాల్సిన ఆ చిన్నారుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. సాయం చేసే చేతుల కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలిలా.. పండు (7) గాయత్రి (12) అక్కాతమ్ముళ్లు. వీరికి ఆధార్ కార్డులు ఉన్నాయి. అయితే పండు ఆధార్ కార్డులో అడ్రస్ ఇందిరమ్మకాలని నంద్యాల జిల్లా అహోబిళం అని,గాయత్రి అడ్రస్ వైఎస్సార్ జిల్లా కొత్త గంగిరెడ్డి పల్లె పెండ్లిమర్రి మండలం అని ఉంది.వీరు చక్రాయపేటలోని పోలీసుస్టేషన్‌కు సమీపంలో ఉన్న యార్లవాండ్లపల్లెకు చేరుకొని రెండు నెలలు కావస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఇక్కడికి ఎలా వచ్చారంటే..

చిన్నారుల తల్లిది యార్లవాండ్ల పల్లె..తండ్రి చనిపోయాక, తల్లి వదిలేయడంతో వాళ్లు ఎక్కువ కాలం తండ్రి వైపు చుట్టాలున్న అహోబిళంలో ఉండేవారు.అయితే పండుకు ఫిట్స్ ఎక్కువ కావడంతో అహోబిళం వాసులు ఆ బరువు తమకెందుకుని రెండు నెలల క్రితం యార్లవాండ్లపల్లెలో వదిలేశారు. ఇక్కడ కూడా అమ్మ వైపున ఉన్న దూరపు బంధువులు వారిని గుర్తించి అన్నం పెడుతున్నారు. ఫిట్స్‌తో బాధపడుతున్న పండును గ్రామస్తులు చందాలు వేసుకొని అన్నమయ్య జిల్లా కలికిరిలో సుమారు రు.10వేలు ఖర్చు పెట్టి వైద్యం చేయించారు.మరో పదిరోజుల్లో మళ్లీ అక్కడికి వైద్యం కోసం వెళ్లాలి. ఈఖర్చు భరించాలంటే ఎలా అని యార్లవాండ్లపల్లె వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండు పరిస్థితి ఇలా ఉంటే గాయత్రికి కూడా మానసిక స్థితి సరిగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. వేంపల్లె పోలీసు స్టేషన్ వద్దకు చిన్నారుల తల్లిని పిలిపించి పంచాయతీ పెట్టించామని, అయితే వారు నాబిడ్డలు కాదు.అసలు నాకు పుట్టనే లేదని ఆమె ఖరాఖండిగా చెప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం చిన్నారులకు వైద్యం చేయించాల్సిన అవసరం ఉంది. దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు. అనాథ శరణాలయాలు, బాల సదన్‌లు, శిశు సంక్షేమశాఖ వారు స్పందించి చిన్నారులకు అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చిన్నారులు గాయత్రి, పండు

డీసీసీ బ్యాంకును లాభాలబాట పట్టించాం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో 35 ఏళ్ల తరువాత డీసీసీ బ్యాంకును నష్టాల నుంచి గట్టెకించి లాభాలబాట పట్టించామని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్క ఉద్యోగికి, ఖాతాదారులకు ధన్యవాదాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2022–23 ఏడాదికిగాను రూ. 2456 కోట్ల మేర వివిధ రకాలు రుణాలను అందించామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 3500 కోట్లు రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే రూ. 46 కోట్లు ఉన్న మొండి బకాయిలను రూ. 36 కోట్లకు తెచ్చామన్నారు. సోమవారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. కో ఆపరేటివ్ బ్యాంకులు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండటంతోపాటు తక్కువ వడ్డీకి రుణాలు ఉంటాయన్నారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రంలో కో ఆపరేటివ్ బ్యాంకులకు నాబార్డు సహకారంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 13 డీసీసీ బ్యాంకులుంటే అందులో 12 లాభాల బాటలో ఉన్నాయన్నారు. బ్యాంకు లాభాల బాట పట్టడంతో సోమవారం చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి బ్యాంకు సిబ్బందితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేకును కేకును కట్ చేసి సంబరాలను చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈఓ కుందుల రాజేంద్రకుమార్, ప్రొఫెషనల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఓఎస్‌డీ సురేంద్రబాబు, బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బారెడ్డి, డైరెక్టర్ గంగాద్రి, హుస్సేన్‌పీరా, డీజీఎం ప్రతాప్‌రెడ్డి, బాలిరెడ్డి, యూనియన్ లీడర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

నేత్రదానంతో మరణించిన వ్యక్తి చూపు సజీవం

పులివెందుల టౌన్/రూరల్ : నేత్రదానం చేయడంవల్ల మరణించిన వ్యక్తి చూపు సజీవంగా ఉంటుందని నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మిట్టా వెంకటరమణయ్య శ్రేష్ఠి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. దీంతో నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు తన సిబ్బందితో కలిసి మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. నేత్రదానానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మృతుడి కార్నియాలను అందుకుంటున్న నేత్ర నిధి సంస్థ సిబ్బంది

కారు అదుపుతప్పి.. కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతి

ఖాజీపేట : ఖాజీపేట మండలం భూమాయపల్లె సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో కళ్యాణ్ రెడ్డి (36) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరానికి చెందిన ఎర్రగుడిపాడు కళ్యాణ్ రెడ్డి ఏపీ04 బీసీ 4689 అనే కారులో మైదుకూరు నుంచి కడపకు వస్తున్నారు. భూమాయపల్లె వద్దకు రాగానే కారు అదుపు తప్పి కల్వర్టును ఢీ కొంది. కారు నుజ్జునుజ్జు అయింది. కారులోని కళ్యాణ్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కుళ్ళాయప్ప, తహసీల్దార్ రమణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు జరిపారు. కళ్యాణ్‌రెడ్డి మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీశారు. బంధుల ఫిర్యాదు మేరకు కేసనమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కళ్యాణరెడ్డి మృతదేహం

మనవళ్లను హాస్టల్‌లో వదిలేందుకు వెళుతూ..

ఖాజీపేట : మండలంలోని పుల్లూరు పంచాయతీలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుల్లపల్లె పెద్ద ఓబయ్య (58) మృతి చెందాడు. ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. సిద్ధవటం మండలం జ్యోతి గ్రామానికి చెందిన పెద్ద ఓబయ్య మనవళ్లు ఖాజీపేట మండలం అప్పనపల్లెలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు.ఇటీవల వరుసగా నాలుగురోజులు సెలవులు రావడంతో వారిని ఇంటికి తీసుకెళ్లారు. తిరిగి హాస్టల్‌లో వదిలేందుకు సోమవారం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. పుల్లూరు పంచాయతీ అంబేడ్కర్ కూడలి వద్దకు రాగానే మైదుకూరు నుంచి కడపకు వెలుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో పెద్ద ఓబయ్య అక్కడిక్కడే మృతి చెందగా అరవింద్, అభివర్మలకు స్వల్పగాయాలయ్యాయి. ఓబయ్య మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కుళ్లయప్ప తెలిపారు.



రోడ్డుప్రమాద దృశ్యం

బంగారు గొలుసు అపహరణ

సింహాద్రిపురం : మండల పరిధిలోని గురిజాల గ్రామానికి చెందిన సుబ్బలక్షుమ్మ మెడలోని బంగారు గొలుసు దొంగ అపహరించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు సుబ్బలక్షుమ్మ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న చీనీ తోట వద్దకు ఒంటరిగా వెళ్లింది. ఆమెను అనుసరించిన వచ్చిన దొంగ రోడ్డు మీద తన ద్విచక్ర వాహనాన్ని పెట్టాడు. ఆమె తోటలో చీనీ కాయలు ఏరుతుండగా.. దొంగ వెళ్లి ఆమెను తోసేసి బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. తోయడం వల్ల సుబ్బలక్షుమ్మకు తలకు, చేతికి గాయాలయ్యాయి. వెంటనే ఆమె లేచి పరుగెత్తుతూ దొంగ దొంగ అరిచినా ఎటువంటి ఫలితం లేకపోయింది. బంగారు గొలుసు సుమారు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

కడప అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయ సాగుతో పంటలకు తెగుళ్లు సోకకుండా అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు అన్నారు. సోమవారం కడపలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన గుళికల ద్వారా చిరుధాన్యాల సాగుతో భూమిని 365 రోజులు కప్పి ఉంచే ప్రక్రియ గురించి తమ యూనిట్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పేద కుటుంబాలకు కిచెన్ గార్డెన్ కిట్స్ అందించి దీని ద్వారా ఇంటికి అవసరమైన కూరగాయలు పండించేలా చూడాలన్నారు. అడిషినల్ డీపీఎం వసంతకుమారి పాల్గొన్నారు.

జిల్లా కోర్టుకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్‌బాక్స్‌లను మంగళవారం జిల్లా కోర్టుకు తరలించనున్నారు. అక్కడ వాటిని భద్రపరచనున్నారు.ఈ మేరకు హైకోర్టు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గత నెల 31న జరిగిన ఎన్నికల్లో 102 ఓట్లకు గాను 99, 24 ఓట్లకు గాను 22 ఓట్లు పడ్డాయి. ఇందుకుగాను వేర్వేరుగా పోలింగ్‌బాక్స్‌లను ఏర్పాటుచేశారు. ఈరెండింటిని రాజంపేట బార్ ఆఫీస్‌లోనే సీజ్ చేసి, కొత్తగా తీసుకొచ్చిన బీరువాలో భద్రపరిచారు. అలాగే బార్ కార్యాలయానికి కూడా తాళాలు వేశారు.

హైకోర్టును ఆశ్రయించి సురేంద్రబాబు..

రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షస్థానానికి పోటీచేసిన కోసూరు సురేంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. బ్యాలెట్ బాక్స్‌లు భద్ర పరిచే విషయంపై రిట్‌పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ హైకోర్టు స్వీకరించింది. మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు కడప జిల్లా కోర్టులో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచాలని ఎన్నికల అధికారి బాలాజీని ఆదేశించారు. బ్యాలెట్‌బాక్స్‌లను కడప కోర్టుకు తరలించే నేపథ్యంలో బార్ ఆఫీసుకు వేసిన తాళాలు తీసేసి, యధావిధిగా బార్ అసోసియేషన్ కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

ఫలితాలపై న్యాయవాదుల్లో ఉత్కంఠ

అసోసియేషన్ ఎన్నికల ఫలితాలపై న్యాయవాదుల్లో ఉత్కంఠ నెలకొంది. సరేంద్రబాబు, లక్ష్మీనారాయణ అసోసియేషన్ అధ్యక్షస్థానానికి పోటీ పడ్డారు. ఇద్దరి గెలుపోటములపై న్యాయవాదులు ఎవరికి వారు ధీమాను వ్యక్తంచేస్తున్నారు. కాగా హైకోర్టు ఉత్తర్వులు వెలువడేవరకు ఓట్ల లెక్కింపు ఉండదు.

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

సింహాద్రిపురం : జిల్లాలోని సింహాద్రిపురం మండలం కోవరంగుంటపల్లె గ్రామంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనాథ్‌రెడ్డి తండ్రి ద్వారకనాథ్‌రెడ్డి, తదితర కుటుంబసభ్యులను పరామర్శించారు.



శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

కడప 'బార్' అధ్యక్షుడిగా రాఘవరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీవీ రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి రాఘవరెడ్డి, బి.గుర్రప్పనాయుడులు పోటీ పడ్డారు. మొత్తం 557 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో గుర్రప్పనాయుడుకు 175 ఓట్లు రాగా, రాఘవరెడ్డికి 378 ఓట్లు లభించాయి. దీంతో ఆయన 203 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నాలుగు ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. ఉపాధ్యక్ష స్థానానికి పీఎస్ బాలసుబ్రమణ్యం, చంద్రమోహన్, ఉమాదేవి పోటీ చేశారు. వీరిలో పీఎస్ బాలసుబ్రమణ్యం గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి వి.చంద్రవదన, వైటీజే కెన్నడి పోటీ చేశారు. వీరిలో చంద్రవదన 177, కెనడికి 379 ఓట్లు రాగా ఒక ఓటు చెల్లనిదిగా ప్రకటించారు. దీంతో జనరల్ సెక్రటరీగా పోటీ చేసిన కెనడి 202 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కె.నిరంజన్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు వారికి ధృవీకరణపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న రాఘవరెడ్డి

అర్జీదారుల సమస్యలకు వేగవంతంగా పరిష్కారం

కడప సిటీ : స్పందనలో వచ్చిన అర్జీదారుల సమస్యలకు పరిష్కారం వేగవంతంగా సూచించాలని కలెక్టర్ విజయరామరాజు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ సాయికాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణ రెడ్డి, ఆనంద్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామమోహన్ లు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాన్ని సాధించండి

జిల్లాలో గృహనిర్మాణ లక్ష్యాన్ని సాధించేందుకు నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జేసీ సాయికాంత్ వర్మ, నగర కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్ఓ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. అవగాహనతో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చేసిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్